## క్లుప్తంగా

### 100 మంది వాకర్స్‌కు వైద్య పరీక్షలు




వాకర్స్‌కు బీపీ పరీక్ష చేస్తున్న డాక్టర్ శ్రీధర్

**ఆరిలోవ:** ముడసర్లోవ దరి స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పక్కన ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అను ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వైద్య సిబ్బంది ఆదివారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో సుమారు 100 మంది వాకర్స్‌కు బీపీ, మధుమేహం తదితర రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వాణి మాట్లాడుతూ కిడ్నీ, గుండె, యూరాలజీ సమస్యలపై అవగాహన అవసరమన్నారు. ఏయే వయసుల వారికి ఎలాంటి సమస్యలు వస్తున్నాయి, వాటిని ఎదుర్కోవడానికి ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, కొరికాన మోహనరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి ఈశ్వరరావు, ట్రెజరర్ అప్పలనాయుడు, సభ్యులు శంకరరావు, బాలస్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### గౌరపూర్ణిమ ఉత్సవం రేపు

**ఎంవీపీ కాలనీ:** ఈ నెల 7న ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో గౌరపూర్ణిమ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి అవతారమైన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భవించిన సందర్భంగా ఈ ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా శ్రీకృష్ణబలరాముల విగ్రహాలకు అభిషేకం, మహా మంగళహారతి, పుష్పవృష్టి, పల్లకి ఉత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆయా సేవలను తిలకించాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

### ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

**కొమ్మాది:** సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

### ఉచిత అంతిమ యాత్ర వాహనం ప్రారంభం



అంతిమ యాత్ర వాహనం ప్రారంభిస్తున్న మూర్తి యాదవ్

**బీచ్ రోడ్డు:** సామాజికవేత్త సారిపల్లి వెంకటరమణ అందించిన ఉచిత అంతిమ యాత్ర వాహనాన్ని ఆదివారం 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సారిపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రూ.11 లక్షలతో ఈ వాహనాన్ని తయారీ చేశామన్నారు. స్థానికంగా ఎవరూ చనిపోయినా ఉచితంగా ఈ వాహనంలో శ్మశానవాటిక వరకు తరలిస్తామన్నారు.

# సదస్సులు C/o ఏయూ మైదానం

- విజయవంతంగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులు
- కలిసొచ్చిన పార్కింగ్ సదుపాయం



ఇటీవల ఏయూ మైదానంలో జీఐఎస్ సదస్సు ఏర్పాట్లు(ఫైల్)

**ఏయూ క్యాంపస్:** అంతర్జాతీయ సదస్సులకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రంలో నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు వేదికగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానాలు ఉపయుక్తంగా నిలుస్తున్నాయి.

**సువిశాల మైదానాలు**

ఏయూలో 25 ఎకరాల సువిశాల మైదానం దశాబ్దాలుగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు వేదికగా ఉపయోగపడుతోంది. తాజాగా దీనికి ఎదురుగా మరో 16 ఎకరాలకు పైగా మైదానాన్ని ఇటీవల అభివృద్ధి చేశారు. దీనికి ఊర్జ(శక్తి) అని ఇటీవల పేరు కూడా పెట్టారు. ఎదురెదురుగా ఉన్న ఈ రెండు మైదానాలు భారీ కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాల్లో ఒకటిగా ఉన్న విశాఖ నడిబొడ్డిలోలో దాదాపు 41 ఎకరాలకు పైగా ఖాళీ మైదానాలు ఉండడంతో రాష్ట్రానికి అతిపెద్ద అడ్వాంటేజ్‌గా మారింది. గతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న భారీ సభకు ఈ మైదానాలే వేదికలయ్యాయి. దాదాపు మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరైన ఈ సమావేశం సజావుగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరగడానికి ఈ సువిశాలమైన మైదానాలే కారణం అనడంలో అతిశయోక్తి కాదు.

**పెద్ద వనరుగా హెలీప్యాడ్‌లు**

జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనే ప్రముఖులు విశాఖ విమానాశ్రయం నుంచి ఏయూలోని సభా వేదికకు రోడ్డు మార్గంలో చేరుకోవడం కంటే వాయు మార్గంలో రావడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రధానమంత్రి విశాఖకు వచ్చిన సందర్భంలో ఏయూలో మూడు హెలీప్యాడ్‌లను నిర్మించారు. ఇవి నేడు వర్సిటీకి పెద్ద వనరుగా మారాయి. ప్రధాన మంత్రి విశాఖ విమానాశ్రయం నుంచి హెలీకాప్టర్‌లో ఏయూ మైదానానికి వచ్చారు. అదే విధంగా శుక్రవారం జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనడానికి పలువురు అతిథులు హెలీకాప్టర్‌లో ఏయూలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం పక్కనే కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన సమావేశ వేదికకు సులువుగా వెళ్లిపోయారు.

### సువిశాల పార్కింగ్ స్థలం



ప్రాంగణంలో పార్కు చేసిన కార్లు(ఫైల్)

ప్రశాంతమైన ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సువిశాల మైదానాలు భారీ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. నగరం మధ్యలో ఉండడం, రోడ్డు, వాయు రవాణా సదుపాయాలు కలిగి ఉండడం మరింత డిమాండ్ ఏర్పడుతోంది. మరో వైపు కార్ల పార్కింగ్‌కు ఉపయుక్తంగా అనువైన స్థలం ఉండడం భారీ కార్యక్రమాల నిర్వహణను సులభతరం చేస్తోంది. శుక్రవారం జరిగిన జీఐఎస్ సదస్సుకు వచ్చిన ప్రతినిధులకు చెందిన వందలాది కార్లకు సమావేశ మందిరానికి ఎదురుగా ఉన్న సువిశాల మైదానంలో పార్కింగ్ సదుపాయం కల్పించారు. దీంతో ప్రతినిధులు సులభంగా సదస్సు ప్రాంగణానికి చేరుకోవడం, తిరిగి వెళ్లడం జరిగింది. పోలీసులకు సైతం ట్రాఫిక్ నియంత్రణ సులభమైంది.

# సీతంరాజు విజయమే అందరి లక్ష్యం



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది
- టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

**సాక్షి, విశాఖపట్నం:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ విజయానికి అందరూ కృషి చేయాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో లబ్ధి పొందిన ప్రతి ఇంటిలో ఎమ్మెల్సీ ఓటు అడిగే హక్కు మనకుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌తో కలిసి ఆయన ఆదివారం నగరంలో విస్తృతంగా ప్రచారం చేశారు. విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 16వ వార్డులో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. విశాఖలో జరిగిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విజయవంతం కావడం, దీని ద్వారా 6 లక్షల ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి విద్యావంతులు, విద్యార్థులు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు కె.కె.రాజు, అక్కరమాని విజయనిర్మల, తూర్పునియోజకవర్గ పరిశీలకుడు డి.వి.సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపా జ్యోతి, యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు శివరామ కృష్ణ, పార్టీ ముఖ్య నాయకులు కాశీ, అప్పారి గిరిబాబు, పీతల గోవింద్, గుడ్ల సత్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**ఆరిలోవ/ఎంవీపీ కాలనీ/బీచ్ రోడ్డు/మద్దిలపాలెం:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్ నాయకులు తమ మద్దతు అభ్యర్థుల తరఫున ప్రచారం ముమ్మరం చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిల్చున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆదివారం పదో వార్డులో మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.పద్మావతి ప్రచారం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఇందిరానగర్, రాజీవ్‌నగర్‌లలో పర్యటించి పట్టభద్రులను కలసి ఓటేయాలని కోరారు. 12వ వార్డులో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, శ్రీనివాస్ తదితరులు నెహ్రూనగర్, దుర్గానగర్‌లలో ప్రచారం చేశారు.

- ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ 17వ వార్డులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, నీలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- సీతంరాజుకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వాసవానిపాలెం, జాలరిపేటల్లో పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు, తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు సూరాడ దాసు, 19వ వార్డు మహిళా విభాగం ఇన్‌చార్జి వసంత పాల్గొన్నారు.
- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల వుడా పార్క్, ఆర్కేబీచ్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. మొదటి ప్రాధన్యత ఓటును సుధాకర్ వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ప్రసాదాలు భాగ్యానంద్, చంద్రబోస్, చంద్రమౌళి, బొట్టా రామచంద్రరావు, కొన జైలక్ష్మి, సంగీతరావు, కుమారి పాల్గొన్నారు.
- ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ తరఫున 23వ వార్డులో వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, వార్డు ఇన్‌చార్జి సత్యారెడ్డి ప్రచారం చేశారు. తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు.
- జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు ఇన్‌చార్జి గిరిబాబు, నాయకులు ప్రచారం చేశారు. సీతంరాజుకు గెలిపించాలని కోరారు.



సుధాకర్‌కు మద్దతుగా వుడా పార్కులో ప్రచారం చేస్తున్న అక్కరమాని విజయనిర్మల



సీతంరాజుకు మద్దతుగా 10వ వార్డులో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి

# వ్యవసాయక సమస్య గ్రంథంతో రైతులకు ఊరట

**బీచ్ రోడ్డు:** రైతులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం క్లార్ కౌట్స్కీ రచించిన వ్యవసాయక సమస్య గ్రంథం ఎంతో ఊరటనిస్తోందని పరిశోధకుడు విద్యాసాగర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో వ్యవసాయక సమస్య తెలుగు అనువాద గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింతగా అభివృద్ధి చేయడం అనేది ఆధునిక రాజ్యం లక్షణమని, అందుకు జలయజ్ఞమే ఓ ఉదాహరణ అని చెప్పారు. వ్యవసాయం ఒకసారి పెట్టుబడిదారీ వలయంలో చేరుకున్న తర్వాత రైతు శ్రమని రైతు ఉపయోగించుకోలేని పరిస్థితిని సృష్టిస్తుందన్నారు. మరో వక్త జగన్నాథస్వామి మాట్లాడుతూ కార్మిక వర్గంతో చిన్న రైతు కలసి ప్రయాణం చేయడం ద్వారా మాత్రమే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల ఆత్మహత్యలకు సామాజిక వేత్తలతో పాటు విద్యార్థులు కూడా శాస్త్రీయ పరిష్కారం కనుగొనాలంటే ఈ గ్రంథం తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణయ్య, బి.రామానాయుడు, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

# జీవో 24 అమలులో చిత్తశుద్ధి అవసరం

**సీతంపేట:** ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జీవో 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బాలవికాస్ ఫౌండేషన్, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం సంయుక్తంగా ఆదివారం బీవీకే కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర సంజీవయ్య లా యూనివర్సిటీ వ్యవస్థాపక వీసీ వై.సత్యనారాయణ మాట్లాడుతూ జీవో నంబర్ 24 అమలులో చిత్తశుద్ధి అవసరమన్నారు. విద్యా హక్కు చట్టం అమలులో ప్రభుత్వంతోపాటు టీచర్లు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు తక్కువై డ్రాప్ అవుట్స్ ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా దృష్టి సారించాలని కోరారు. జీవో అమలులో లోపాలను స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక వంటి పథకాలు అందులో భాగమేనన్నారు. పూర్తి స్థాయిలో చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గౌరీ శంకర్, అబ్దుల్ బేగ్, నరసింహారావు, హరగోపాల్, మధుసూదనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ సత్యనారాయణ

## సమాచారమ్

### కాన్ఫరెన్స్ అధ్యక్షుడిగా సుదర్శనరావు



ఆచార్య సుదర్శనరావు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు ఆర్.సుదర్శనరావు ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ నెల 27, 28 తేదీలలో తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో నిర్వహించే 39వ వార్షిక సదస్సులో ఆయన అధ్యక్షోపన్యాసం చేయనున్నారు. సదస్సులో మూడు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వృద్ధి, నూతన విద్యా విధానం, రాయలసీమ ప్రాంతంలో ఆర్థిక ప్రగతి అనే అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చిస్తారు. ఈ సందర్భంగా ఆచార్య సుదర్శనరావును విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

### ఖైదీలకు దంత పరీక్షలు

**ఆరిలోవ:** విశాఖ కేంద్ర కారాగారంలో సీఐఐ యంగ్ ఇండియన్ విశాఖపట్నం చాప్టర్, గీతం దంత కళాశాల ఆధ్వర్యంలో 'నేషనల్ కాన్స్-ఎండో డే'సందర్భంగా ఆదివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గీతం దంత వైద్యులు సుమారు 200 మంది ఖైదీలకు దంత పరీక్షలు చేశారు. అవసరైన వారికి మందులు, టూత్ పేస్టులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు నోటి ఆరోగ్యం, దంత సంరక్షణపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గీతం దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఎస్.రాజు, వైజాగ్ యంగ్ ఇండియా సభ్యులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గీతాభవన్‌లో నక్షత్రమాల



కృష్ణ భగవానునికి పూజలు చేస్తున్న అతిథులు

**డాబాగార్డెన్స్:** గీతా ప్రచార సమితిని ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం నక్షత్రమాల పేరిట 27 నక్షత్రాలకు.. 27 సార్లు భక్తులందరిచే సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ముందుగా గీతా మందిరంలో వేంచేసిన విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జున ప్రతిష్ట మూర్తులకు, గోసహిత శ్రీకృష్ణ భగవానుని ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ మురళీకృష్ణ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వల్ల విశ్వశాంతి కలగడమే గాక పాల్గొన్న వారందరికీ శుభాలు కలుగుతాయని అభిలషించారు. గీతా ప్రచార సమితి గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఉత్సవాలను ఆయన ప్రశంసించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

### అనంతుని రథోత్సవం నేడు



అనంతుని ఉత్సవ విగ్రహాలు

**పద్మనాభం:** పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో జరుగుతున్న అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం రాత్రి రథోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం రాత్రి పది గంటలకు శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను రథం పైకి తోడ్కొని వస్తారు. విశేష పూజల తర్వాత రాత్రి 11 గంటలకు గాలి గోపురం వద్ద రథోత్సవం ప్రారంభమవుతుంది.

### పెరిగిన పర్యాటకుల తాకిడి

**కొమ్మాది:** ఎండలు విజృంభిస్తున్న తరుణంలో తీరంలో పర్యాటకుల సందడి పెరిగింది. సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, తొట్లకొండ, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్‌కు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం సముద్ర స్నానాలు చేశారు.



# మంచిగా జీవించండి



ఫోర్త్ టౌన్ పీఎస్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా జోన్ సీఐ సింహాద్రినాయుడు

**సీతమ్మధార:** ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. ఎటువంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతానికి స్వస్తి పలికి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, సమాజంలో మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, ప్రమీల, వెంకటరావు, మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

**ద్వారకా పీఎస్‌లో..**

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు, ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. తగాదాల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి మంచిగా జీవించాలని సూచించారు. రౌడీ షీటర్ల దినచర్యపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఎర్నిమాంబ ఆలయంలో ప్రత్యేక దర్శనాలు

**కంచరపాలెం :** జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఫాల్గుణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

### నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తి

**కూర్మన్నపాలెం :** విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి ఉద్యమ స్ఫూర్తి అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప అన్నారు. ఈ మేరకు 752వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వై.మస్తానప్ప కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



752వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మస్తానప్ప